ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024






బంగారుపాళ్యం గిరిజన హాస్టల్‌లో విరిగిన ఫ్యాన్ - శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో పెచ్చులూడిన హాస్టల్ భవనాలు - పూతలపట్టు మండల ఎస్సీ హాస్టల్‌లో విరిగిపోయిన కిటికీలు - బంగారుపాళ్యంలో తలుపులు లేని మరుగుదొడ్లు

వసతిలేని గృహాలు

'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ' అంటూ ప్రసంగాలు చేసిన నాటి సీఎం జగన్ గత ఐదేళ్లుగా వారి సంక్షేమాన్ని గాలికొదిలేశారు. ఆయా వర్గాల విద్యార్థుల చదువుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాల నిర్వహణను పూర్తిగా విస్మరించారు. ఐదేళ్లలో రూపాయి కూడా విదల్చకపోవడంతో భవనాల నిర్వహణ, శుభ్రత మచ్చుకైనా కనిపించడం లేదు. అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. శిథిల భవనాలు, పెచ్చులూడిన పైకప్పులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నడుమ చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. - చిత్తూరు

- దుస్థితిలో సంక్షేమ హాస్టళ్లు
- శిథిల.. అద్దె భవనాల్లో విద్యార్థుల అగచాట్లు
- వెంటాడుతున్న గత పాలకుల పాపాలు

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 41 ప్రీమెట్రిక్, 16 పోస్టు మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో మూడు వేల మందికి పైగా విద్యార్థులు ఆశ్రయం పొందుతూ చదువుకుంటున్నారు. బీసీ సంక్షేమశాఖ పరిధిలో 25 ప్రీమెట్రిక్, 13 పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో రెండు వేల మంది వరకు ఉంటున్నారు. అలాగే చిత్తూరు శివారులోని పూనేపల్లె క్రాస్‌లో చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలకు సంబంధించిన వసతి గృహంలో మూడు నుంచి పదో తరగతి వరకు 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరులోని వసతి గృహంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లు ఇస్తామని చెప్పారే గాని ప్రస్తుతం అక్కడ ఒక్కరు కూడా లేరు.

ఐదేళ్లలో జాడే లేని సంక్షేమం

ఆర్థిక స్తోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలు మూడు పూటలా తిని చదువుకుంటారనే ఆశతో ఇక్కడ చేర్పిస్తుంటారు. తిండి, దుస్తులు, పుస్తకాలు, కాస్మోటిక్ చార్జీల కింద కొంత డబ్బు వస్తుందనే నమ్మకం. ఆ దిశగా గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అడుగులు వేయలేదు. నిధులు ఇవ్వకపోవడంతో నాణ్యత లేని భోజనం తినలేక విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. ఏ విద్యా సంవత్సరంలోనూ సరైన సమయానికి యూనిఫాం, పుస్తకాలు ఇవ్వలేదు. కాస్మోటిక్ చార్జీల ప్రస్తావనే లేదు. ఈ క్రమంలో ఆ భారాన్ని తల్లిదండ్రులే భరించాల్సిన పరిస్థితి నెలకొంది.


శాంతిపురం మండలం దండికుప్పంలో

కిటికీలు లేని గదులు..తలుపుల్లేని మరుగుదొడ్లు

జిల్లాలోని ఏ వసతి గృహానికి వెళ్లినా దయనీయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. చాలాచోట్ల మరుగుదొడ్లకు తలుపులు లేవు. కొన్ని చోట్ల తలుపులు పూర్తిగా పాడైపోయాయి. పాత బెడ్‌షీట్లను అడ్డం పెట్టుకుని విద్యార్థినులు స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. శాంతిపురం మండలం దండికుప్పం, రాళ్లబూదుగూరులోని హాస్టళ్ల భవనాలు పెచ్చులూడి పడుతున్నాయి. పూతలపట్టు మండలంలోని ఎస్సీ హాస్టల్‌లో కిటికీలు విరిగిపోయాయి. బంగారుపాళ్యం హాస్టల్‌లో ఫ్యాన్ రెక్కలు విరిగిపోయి కొన్ని ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే దిక్కులేకుండాపోయింది. వసతి గృహాల ఆవరణలో విద్యుత్ దీపాలు, ప్రహరీలకు సరైన గేట్లు లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోతోంది. నీటి వసతి లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ నీరు సరిపోకపోవడంతో బయట చేతిపంపుల వద్దకు వెళ్లి స్నానాలు చేయాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. పది మంది విద్యార్థులకు ఒక మరుగుదొడ్డిని నిర్మించంతో చాలా మంది ఇప్పటికీ ఆరు బయటే బహిర్భూమికి వెళ్లివస్తున్నారు. ఈ కారణంగా హాస్టళ్లలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు.

జడ్పీ పదోన్నతుల్లో అవకతవకలు

- మాజీ సీఈవో అనుచరులకే అవకాశం
- సీనియర్లను కాదని జూనియర్లకు అందలం
- డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేయనున్న యూనియన్ నాయకులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 4: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ చేసినా.. ఆయన అనుచరులు మాత్రం ఇంకా చక్రం తిప్పుతున్నారు. కొందరు ఉన్నత పదువుల్లో ఉంటే మరి కొంత మంది అడ్డదారిలో పదోన్నతులు పొందుతున్నారన్న విమర్శలున్నాయి. సీనియారిటీని పక్కనబెట్టి జూనియర్లకు పదోన్నతులు కల్పిస్తున్నారని జడ్పీ ఉద్యోగ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ అవకతవకలపై నేడో, రేపో పీఆర్ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. అసలేం జరిగిందంటే.. జిల్లా పరిషత్తులో 2021 వరకు పదోన్నతులు సీనియారిటీ జాబితా మేరకు జరిగేవి. ప్రభాకర్‌రెడ్డి సీఈవో అయ్యాక తన అనుచరులు, మాటవినే వారికే పదోన్నతులు కలిపిస్తూ వచ్చారు. అతడిని ప్రశ్నించిన వారి పేరు పదోన్నతుల జాబితాలో ఉన్నప్పటికీ, ఏదో ఒక క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు చూపి పక్కనపెట్టేవారు. తన వారికే జూనియర్లయినా సరే పదోన్నతులు కల్పించారన్న ఆరోపణలున్నాయి. ఇలా అధికారుల్లోని ప్రభాకర్‌రెడ్డి అనుచరులు ప్రస్తుతం పదోన్నతుల జాబితా తయారీలో తమకు కావాల్సిన వారికే ముందు వరసలో స్థానం కల్పించారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో జడ్పీ సీఈవోను కూడా తప్పుదారి పట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘ, జడ్పీ సాధారణ నిధుల వినియోగంలో అవినీతిపై జరుగుతున్న విచారణతో పాటు పదోన్నతుల్లో జరిగిన అవకతవకలపైనా విచారించాలని డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేయనున్నట్లు ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు.

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(సింగిల్ విండో)లో ఆధిపత్య పోరు సాగుతోంది. 76 సింగిల్ విండోలకుగాను చాలాచోట్ల 20-30 ఏళ్లుగా సీఈవోలు తిష్టవేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిన్నటివరకు త్రీమెన్ కమిటీని, ఇప్పుడు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిని సైతం లెక్కచేయడం లేదు. పలుచోట్ల సీఈవోలే సింగిల్ విండోల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి డీసీసీబీ సీఈవో, డీసీవోలే భయపడుతున్నారు.
- చిత్తూరు కలెక్టరేట్

సహకార సంఘాల్లో

దశాబ్దాలుగా తిష్టవేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం

సీఈవోల పెత్తనం

రైతులకు చేదోడుగా ఉండాల్సిన సింగిల్ విండోల్లో గత ఐదేళ్లలో త్రీమెన్ కమిటీలు ఉండేవి. నెల క్రితం కూటమి ప్రభుత్వం ఏర్పడి, ఆ కమిటీలను రద్దుచేసి సహకార శాఖకు చెందిన సీనియర్, జూనియర్ రిజిస్ట్రార్లను, ఆడిటర్లను అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. అప్పుడు, ఇప్పుడు రైతులకోసం పనిచేయాల్సివుండగా ఏళ్ళ తరబడి తిష్టవేసిన సీఈవోలు లెక్కపెట్టకపోవడంతో కమిటీలు ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నాయి. ఒకవేళ ఎన్నికలు జరిగితే సొసైటీల చైర్మన్ పదవీకాలం ఐదేళ్లే. కానీ సీఈవోలు మాత్రం ఉద్యోగ విరమణ చేసేంతవరకు తమను ఎవరూ ఏమీ చేయలేరనే అభిప్రాయంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కమిటీ చైర్మన్లకు అప్పట్లో, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిలకు ఇప్పుడు సీఈవోలతో పొసగక సమస్య జఠిలంగా మారి సొసైటీల ప్రతిష్ట దెబ్బతింటోంది. సింగిల్ విండోల్లో కోల్డ్‌వార్‌తో తిరోగమన దిశగా పయనిస్తోందన్న చర్చ సాగుతోంది.

డీఎల్ఈఎస్ భేటీలు కరువు

సింగిల్ విండోల బాగోగులు, సీఈవోలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన డిస్ట్రిక్ లెవల్ ఎంపవర్డ్ కమిటీ (డీఎల్ఈఎస్) ఎప్పుడూ భేటీ కాలేదు. ఈ కమిటీలో డీసీసీబీ చైర్మన్ (ఇప్పుడు పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ)తో పాటు బ్యాంకు సీఈవో, డీసీవో, నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు ఉంటారు. సింగిల్ విండోల్లో సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయ పరచడం, అవసరమైతే సీఈవోలను ఇతర సొసైటీలకు బదిలీ చేయాలని ఆప్కాబ్‌కు సిఫార్సుచేయడం ఈ కమిటీ విధి. సింగిల్ విండో కమిటీ అధికారులు, సీఈవోల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించి సొసైటీల ద్వారా రైతులకు మేలు చేకూర్చేలా డీఎల్ఈఎస్ కమిటీ వ్యవహరించాలి. రైతులకు రుణాలిచ్చే విషయంలో రాజకీయ నేతలకు, రైతుల మధ్య ఘర్షణ వైఖరి కల్పించి కోరిన వారికి మాత్రం నిబంధనలకు మించి రుణాలివ్వడం, కాని వారికి సీఈవోలు రిక్తహస్తం చూపుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. సీఈవోల బదిలీ విషయంలో ఆప్కాబ్ నిర్ణయం తీసుకోకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని దాదాపు 50కి పైగా సింగిల్ విండోల్లో సమస్యలు జఠిలంగా మారుతున్నాయి.

> **డీఎల్ఈఎస్ నిర్ణయంతోనే బదిలీలు**
>
> దీర్ఘకాలికంగా సొసైటీల్లో పనిచేస్తున్న సీఈవోల బదిలీలతో పాటు అన్ని సొసైటీలలో బదిలీలపై డీఎల్ఈఎస్ కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కమిటీ తీర్మానం మేరకు బదిలీల ఉత్తర్వులు వస్తే ఆ ప్రక్రియను డీసీసీబీ సీఈవో నిర్వహిస్తారు. కొన్ని సొసైటీల్లో దీర్ఘకాలంగా సీఈవోలు ఒకే ప్రాంతంలో పనిచేస్తుండడంతో సమస్యలు ఏర్పడిన పరిస్థితులు మా దృష్టికి వచ్చాయి.
>
> - నాగవర్ధన, డీసీవో, చిత్తూరు

ఇప్పటికైనా డీసీసీబీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ డీఎల్ఈఎస్ భేటీ నిర్వహించి, సొసైటీల పరిస్థితులను అంచనా వేయడంతో పాటు దీర్ఘకాలంగా తిష్టవేసిన వారికి స్థానచలనం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

బదిలీలపై దృష్టి సారించని ఆప్కాబ్

వాస్తవానికి సింగిల్ విండోల సీఈవోల బదిలీని ఆప్కాబ్ పర్యవేక్షించాలి. ఉమ్మడి జిల్లాలో డీసీసీబీ, సొసైటీల్లో బదిలీల ప్రక్రియను చూడాలి. జిల్లా సహకార బ్యాంకుతో పాటు బ్రాంచుల్లో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు బదిలీలు చేస్తున్నా, విండోల్లో మాత్రం సీఈవోల బదిలీపై దృష్టి సారించడం లేదు. దీంతో ఒకే విండోలో దశాబ్దాలుగా సీఈవోలు కొనసాగుతుండడం, నిధుల దుర్వినియోగం చేస్తూ పైవారి నిర్ణయాలను వారు ఖాతరుచేయడం లేదు. తమచే నిమితులైన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సింది డీసీవోనే అంటూ డీసీసీబీ సీఈవో వెనుకడుగు వేస్తోంది.

ఎర్రచందనం స్వాధీనం

- స్మగ్లర్‌ను వదిలి కూలీని అరెస్టు చేయడంపై టీడీపీ నిరసన


టీడీపీ నాయకుల నిరసన

శ్రీరంగరాజపురం, ఆగస్టు 4: ఎస్ఆర్‌పురం మండలంపిళ్లారికుప్పం గ్రామంలోని మామిడి తోపులో రూ.7 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను పోలీసులు ఆదివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. దీని వెనుక ఉన్న స్మగ్లర్, వైసీపీ నేతను వదిలి కూలీని అరెస్టు చేయడాన్ని టీడీపీ నాయకులు తప్పుబట్టారు. ఎస్ఐ కుళాయిప్ప తీరును నిరసిస్తూ చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. స్మగ్లర్‌ను తప్పించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వార్త కవరేజ్ కోసం వెళ్లిన ఓ విలేకరి సెల్‌ఫోన్‌ను ఎస్ఐ లాక్కోవడం వెనుక అర్థమేమిటని నిలదీశారు. విషయం తెలుసుకున్న కార్వేటినగరం సీఐ సత్తిబాబు ఆందోళనకారులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. విచారించి స్మగ్లర్‌పైనా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు. కాగా, పోలీసులు ఇప్పటికే ఆ వైసీపీ నేతను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు (ఇన్‌సెట్‌లో) పోలీసుల అదుపులో ఉన్న కూలీ

'కూటమి' హయాంలో సమర్థ పాలన

- మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

పలమనేరు, ఆగస్టు 4: 'గత ప్రభుత్వంలో రాష్ట్రం ఎన్నో సమస్యలు ఎదుర్కొంది. వీటన్నింటిని కూటమి ప్రభుత్వం సరిచేసి పాలనను గాడిలో పెడుతుంది. తద్వారా చంద్రబాబు ప్రభుత్వం సమర్థంగా సుపరిపాలన అందిస్తుది' అని మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పలమనేరులో ఆదివారం ఆయన ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. అమరనాథరెడ్డి తండ్రి, తన తండ్రి మంచి మిత్రులని గుర్తుచేసుకున్నారు. అదే విధమైన స్నేహాన్ని తామూ కొనసాగిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలుగా ఇద్దరం చాలాకాలం పనిచేశామని చెప్పారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడి ప్రజలు ఇచ్చిన అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చిందన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు పూర్తితో పాటు రాష్ట్రం అగ్రగామిగా ఉండేలా చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కీలపట్ల దేవస్థానాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకొచ్చారని, నేడు ఆ దేవస్థానం ఎలా అభివృద్ధి చెందిందో మనం చూస్తున్నామన్నారు. పలమనేరు - కీలపట్ల రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఆర్వీబాలాజి, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రనాయడు, ఆర్వీసీకుట్టి, గిరిబాబు, ఖాజాపీర్, సోమశేఖర్‌గౌడు, బీజేపీ నాయకులు విజయ్, శరవణ, జనసేన నాయకులు దిలీప్, పూలచైతు, నాగరాజు, చందు, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

అమరావతికి కలెక్టర్ పయనం

- నేడు కలెక్టర్ల సమావేశంలో పాల్గొననున్న సుమిత్‌కుమార్



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4: కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం మధ్యాహ్నం అమరావతికి బయలుదేరి వెళ్లారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం జరిగే ఒక రోజు రాష్ట్రస్థాయి కలెక్టర్ల సమావేశంలో పాల్గొననున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూముల ఆక్రమణలపై డేటాను కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, సమావేశానికి సంబంధించి తొలుత సీఎం చంద్రబాబు నాయుడు కీనోట్ అడ్రస్ ఇస్తారు. జిల్లాలో పాలనాపరమైన అంశాలు, విధాన నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు, ఇసుక, వ్యవసాయ రంగం తదితర అంశాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించనున్నారు. అసైన్డ్, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ అంశం, భూఆక్రమణలు, అసైన్డ్ భూముల పరాధీనం, అక్రమ రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్ తదితర అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం శాంతిభద్రతలపై జరిగే సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ మణికంఠ కూడా పాల్గొననున్నారు.

'నీలం' మామిడి టన్ను రూ.1.10 లక్షలు

బంగారుపాళ్యం, ఆగస్టు 4: మేలైన నీలం మామిడి టన్ను రూ.1.10 లక్షల ధర పలికింది. ఆదివారం బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు రైతులు తరలించిన మేలైన నీలం రకం మామిడికి వేలం పాట నిర్వహించారు. పెద్దఉప్పరపల్లికి చెందిన రైతు ఖాదర్‌వల్లి తెచ్చిన మామిడిని చెన్నై, బెంగళూరు వ్యాపారులు టన్ను రూ.1.10 లక్షలకు కొనుగోలు చేశారు. మరో రెండుమూడు రోజుల్లో మామిడి సీజన్ ముగియనున్నట్లు మండీ యజమానులు తెలిపారు.


వేలంపాట నిర్వహిస్తున్న మండీ యజమానులు



ఆక్రమిత చెరువులో వృక్షాల నరికివేతతో మిగిలిన కలప - చెరువులో వృక్షాలు నరికివేయగా మిగిలిన మొదళ్లు (ఇన్‌సెట్లో)



ఆక్రమణ కోసం తాజాగా చదును చేసిన స్థలం

చెరువును చెరబట్టారు!

సగినేకుప్పంలో ఆక్రమణలను అడ్డుకున్న గ్రామస్తులు ● సర్వే చేపట్టి సరిహద్దుల్లో కందకాలు తవ్వితేనే రక్షణ



ఆక్రమణల బారి నుంచి కాపాడాలంటూ చెరువు వద్దకు చేరుకున్న సగినేకుప్పం, పరిసర గ్రామాల ప్రజలు

రామకుప్పం, ఆగస్టు 4: రామకుప్పం మండలం బందార్ల పల్లె పంచాయతీ సగినేకుప్పం చెరువును అక్రమార్కులు చెరబట్టారు. రామకుప్పానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సర్వేనెంబరు 31లోని ఈ చెరువు విస్తీర్ణం 23.43ఎకరాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. దశాబ్దకాలంగా ఎక్కడికక్కడ చెరువు ఆక్రమణలకు గురయ్యింది. దీంతో చెరువు విస్తీర్ణం కుచించుకుపోయింది. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం ఆక్రమణలు పోనూ 14ఎకరాలు మాత్రమే ఉంది. తాజాగా ముద్దనపల్లెకు చెందిన ఒకరు శనివారం రాత్రికిరాత్రే ఎక్స్‌కవేటర్లతో రెండు ఎకరాల మేర చెరువు భూమిని చదును చేసేశాడు. ఆ భూమిలోని భారీ వృక్షాలను పెకలించి, తరలించేశాడు. ఆదివారం ఈ విషయం తెలిసి సగినేకుప్పం, పరిసర గ్రామాల ప్రజలు చెరువు వద్దకు చేరుకున్నారు. సదరు వ్యక్తిని చెరువు భూమి ఆక్రమణపై నిలదీశారు. రికార్డుల మేరకు తమకు చెందిన భూమినే చదును చేసుకున్నామని అతడు బుకాయించాడు. దీంతో రైతులు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చెరువును సర్వే చేయిస్తామని అంత వరకు ఆ భూమిలో ఎటువంటి సాగు చేయరాదని చెప్పడంతో అతడు వెళ్లిపోయాడు. గతంలో అధికారుల నిర్లక్ష్యంతో చెరువు నలువైపులా ఆక్రమణలకు గురైంది. ఉన్నతాధికారులు స్పందించి చెరువును సర్వే చేయించి, సరిహద్దుల్లో కందకాలు తవ్వించి, చెరువు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు, ఆగస్టు 4: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

● చిత్తూరు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉంటుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 4: కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన ఆదివారం చిత్తూరు జింకల పార్కు సమీపంలో చోటు చేసుకుంది. అటవీ శాఖ తూర్పు విభాగం కార్యాలయం పక్కనే ఉన్న జింకల పార్కు నుంచి ఓ జింక దారి తప్పి సమీపంలోని వీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడి కుక్కలు మూకుమ్మడి దాడి చేయడంతో మృతి చెందింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది జింకకు అక్కడే పంచనామా చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4: జిల్లాలో 2014-15 నుంచి 2018-19 వరకు నిర్వహించిన ఉపాధి హామీ, నీరు-చెట్టు, ఎస్డీఎఫ్ బిల్లులకు సంబంధించిన రూ.120 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జిల్లా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్ కోరారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులు సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌ల సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం మళ్లించిన గ్రామ పంచాయతీల నిధులను విడుదల చేయాలని కోరారు. తగు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. పంచాయతీ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షులు వై.వినోద్ రాజు, గోగినేని వసుధ పాల్గొన్నారు.

ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. విజయపురంలో 12.6, నగరి 4.8, నింద్ర 4.2, గంగవరం 3.8, పెనుమూరులో 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యంశర్మ

నగరి ఆగస్టు4: చిత్తూరు ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరి లయన్స్ క్లబ్, చదరంగం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ప్రారంభించిన విశ్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం శర్మ మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ చదరంగం పోటీలు మేధస్సును పెంచుతాయన్నారు. గ్రామీణ స్థాయిలో పోటీలను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి జూనియర్ విభాగంలో 126మంది, సీనియర్ విభాగంలో 24 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, జోన్ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, మాజీ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షులు గజేంద్ర, సభ్యులు దేవన్, జీవన్, మహ్మద్, రవికుమార్, శివకేశవులు, ఖలీల్‌భాషా, సత్యానందం పాల్గొన్నారు.

కుప్పం రైల్వే స్టేషన్‌లో రెండో టికెట్ కౌంటర్ నిర్మాణం



రెండవ ప్లాట్ ఫామ్‌వైపు శరవేగంగా నిర్మాణమవుతున్న అదనపు కౌంటర్

కుప్పం, ఆగస్టు 4: కుప్పంలో రైల్వే ప్రయాణికుల కష్టాలు కొంతమేర త్వరలోనే తీరబోతున్నాయి. రెండవ అదనపు టికెట్టు కౌంటర్ నిర్మాణం శరవేగంగా నిర్మాణం అవుతుండడమే దీనికి కారణం. కుప్పం రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్ ఫామ్‌లు ఉన్నాయి. ఒకటి జోలారుపేట నుంచి బెంగళూరు మీదుగా వెళ్లే రైల్వే ప్రయాణికుల కోసం నిర్మాణమైన మొదటి ప్లాట్ ఫామ్. మరొకటి బెంగళూరు వైపునుంచి జోలార్‌పేట వైపు వెళ్లేది. మొదటి ప్లాట్ ఫామ్ కుప్పం నేతాజీ రోడ్డు వైపు ఉన్నది. ఆర్టీసీ బస్టాండుతోటు పట్టణంలోని ప్రధాన భాగమంతా ఇటువైపే ఉండడంతో ఈ ప్లాట్ ఫామ్ మీదనే ఎప్పటినుంచో టికెట్ కౌంటర్ నిర్వహిస్తున్నారు. పేరుకు రెండు కౌంటర్లు ఉన్నా సరే, ఇందులో ఒకే కౌంటర్ వినియోగంలో ఉంది. రెండవ కౌంటర్‌ను ఎప్పుడూ మూతవేసి ఉంటారు. ఉన్నది ఒకే కౌంటర్ కావడంతో ఎప్పుడూ దీనివద్ద ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రైలు వచ్చే సమయం దాటిపోతున్నా, ప్రయాణికులు టికెట్టు కౌంటర్ క్యూలోనే ఉండాల్సిన పరిస్థితి. అంతేగాక జోలారుపేట నుంచి బెంగళూరు వైపు వెళ్లే రైళ్లలో ప్రయాణించాల్సిన వారు పట్టణంవైపు ఉన్న టికెట్టు కౌంటర్‌లో టికెట్లు తీసుకుని అటు రెండవ ప్లాట్ ఫామ్ మీదికి వెళ్లాల్సి ఉంటుంది. రెండు ప్లాట్ ఫామ్‌ను కలుపుతూ రైల్వే పట్టాల మీదుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ మధ్యనే లిఫ్ట్ సౌకర్యం కూడా ఈ బ్రిడ్జి మీదికి ఏర్పాటు చేశారు. అయితే కొంతమంది ఆకతాయిలు ఈ లిఫ్ట్‌ను మధ్యలోనే ఆపేస్తుండడంవల్ల ప్రయాణికులు భయపడి, మెట్లమీదుగానే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదికి చేరుకోవాల్సి వస్తోంది. పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఈ మెట్లను ఎక్కడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ టికెట్టు కౌంటర్ వద్ద రద్దీ వల్ల ఆలస్యం అవడంవల్లనో లేదా ఏదో పనివుండి చివరి నిముషంలో రైల్వే స్టేషన్‌కు రావడంవల్లనో రైలు వచ్చేస్తుందన్న తొందరలో ప్రయాణికులు టికెట్టు తీసుకున్న తర్వాత మొదటి ప్లాట్ ఫామ్ నుంచి రెండవ ప్లాట్‌ఫామ్‌కు పట్టాలమీదుగానే దాటుతున్నారు. ఈ సమయంలో రైలు ఢీకొని మరణాలు సంభవిస్తున్నాయి. ఈ సమస్యపై అనేకమార్లు రైల్వే అధికారులకు ఫిర్యాదులు అందాయి. రెండవ ప్లాట్‌ఫామ్‌పై అదనపు కౌంటర్ నిర్మిస్తే కొత్తపేట వైపు ఇంకా అటువైపు ఉన్న గ్రామీణ ప్రజలు ఈ కౌంటర్‌లో టికెట్టు కొని అటునుంచి అటే రైలు ఎక్కే వీలుందని వినతులు వెళ్లాయి. ఇన్నాళ్లకు ఈ ఫిర్యాదులు, వినతుల పట్ల రైల్వే శాఖలో కదలిక కనిపిస్తోంది. కొత్తపేట వైపు ఉన్న రెండవ ప్లాట్ ఫామ్‌ను ఆనుకుని అదనపు కౌంటర్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కౌంటర్ మాత్రమే కాదు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం మరో నిర్మాణం చేస్తున్నారు. ఈ రెండు నిర్మాణాలు పూర్తయి వినియోగంలోకి వస్తే కుప్పంలోని సగభాగంలో ఉన్న ప్రజల సమస్య తీరుతుంది. పట్టాలు దాటే అవసరం తగ్గి, ఆమేరకు రైలు ప్రమాద మరణాలు అదుపులోకి వస్తాయి. రెండవ ప్లాట్ ఫామ్‌పై అదనపు కౌంటర్‌తోపాటు ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం షెడ్డు నిర్మాణం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గంగమ్మ దర్శనానికి క్యూలో వేచియున్న భక్తులు

బోయకొండలో భక్తుల రద్దీ



చౌడేపల్లె, ఆగస్టు4: బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఆషాడమాస చివరి ఆదివారం కావడంతో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లను అలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

ప్రజల సొమ్ముతో వైసీపీ నాయకుల జల్సాలు

● తిరుపతి కార్పొరేషన్‌లో రూ.3కోట్ల స్కామ్
● పనిచేయకనే 90మందికి జీతాల చెల్లింపు: జనసేన

తిరుపతి (జీవకోన), ఆగస్టు 4: ప్రజల సొమ్ముతో గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు జల్సాలు చేశారని తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మండిపడ్డారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి కార్పొరేషన్‌లో రూ.3కోట్లు స్నాక్స్ స్కామ్ జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో అన్నీతానై వ్యవహరించిన అప్పటి డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, వైసీపీ కార్పొరేటర్లు ప్రజలకు చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపుడో ఓసారి మీటింగ్ పెట్టుకుని రూ.3కోట్లు స్నాక్స్ రూపంలో ఖర్చు పెట్టారని స్వయానా వైసీపీ కార్పొరేటర్లే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కొందరేమో రూ.38లక్షలు అంటారు.. మరికొందరు అధికారులేమో రూ.1.50 అంటారు.. మొత్తానికి రూ.3కోట్లు సమోసాల పేరుతో తినేశారని ఆరోపించారు. మరోపక్క 90మందిని కార్పొరేషన్‌లో నియమించుకున్నట్లు తప్పుడు లెక్కలు చూపి వారికి 25 నెలల పాటు జీతాల పేరుతో సొమ్మును దిగమింగారని చెప్పారు. మనుషులే పనిచేయని చోట జీతాలు ఎలా చెల్లించారంటూ ప్రశ్నించారు. కార్పొరేషన్‌లోని ప్రతి అధికారి ఇంట్లో ఇద్దరు మనుషులను పెట్టుకుని వారి సొంత పనులకు వినియోగించుకుని ప్రజల సొమ్ముతో జీతాలు చెల్లించారన్నారు. అదే విధంగా డబుల్ డెక్కర్ బస్సును రూ.2కోట్లు పెట్టి కొనుగోలు చేశారని.. ప్రస్తుతం ఆ బస్సు గోవిందధామం పక్కన పాత వాహనాల మధ్యలో పెట్టేశారన్నారు. ఈ బస్సు కోసం నగరంలోని పచ్చని చెట్లను సైతం నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వినోద్, సుమన్‌బాబు, కిషోర్, మనోజ్, ఆది, పవన్, సుమంత్, రాజేంద్ర, సిద్ధు, లోకేష్, భాను తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్



గ్యాలరీలను పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

శ్రీవారి మాడవీధుల్లో తనిఖీలు

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం తనిఖీ చేశారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో మాడవీధుల్లో ఉన్న వివిధ ప్రవేశ, నిష్క్రమణ, హారతి పాయింట్ల గురించి తెలుసుకోవడానికి అన్ని గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.వాహన మండ పం నుంచి ప్రారంభమై నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలు, తిరుమలనంబి ఆలయం వద్ద కదిలే వంతెన,గ్యాలరీల వద్ద ప్రవేశ నిష్క్రమణ పాయింట్లు, ఇతర సంబంధిత సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో నందకిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి రాహు-కేతు పూజల్లో రికార్డు

ఆదివారం ఒక్కరోజే 9,168 టిక్కెట్ల విక్రయాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 4: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాహు-కేతు పూజల సంఖ్య ఆల్‌టైం రికార్డుగా నమోదైంది. ఆలయంలో ఐదు రకాల ధరల టిక్కెట్లపై వేర్వేరుగా రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు జరిగే విషయం తెలిసిందే. 14 నెలల కిందట ఐదు రకాల టిక్కెట్లు 7,200 అమ్ముడు కావడం రికార్డుగా నమోదైంది. తాజాగా ఆషాడ అమావాస్య ఆదివారం కలిసి రావడంతో ఈ ఒక్కరోజే 9,168 రాహుకేతు పూజా టిక్కెట్లు అమ్ముడై సరికొత్త రికార్డుగా నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముక్కంటి ఆలయంలోని రాహుకేతు మండపాలు భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి.

ఐదు రకాల టిక్కెట్ల వివరాలిలా..

రూ.500 టిక్కెట్లు 5,183, రూ.750.. 2,288, రూ.1,500.. 933, రూ.2,500.. 610, రూ.5వేల టిక్కెట్లు 154 కలిపి మొత్తం 9,168 రాహుకేతు పూజలు జరిగినట్లు ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అలాగే ఐదు రకాల ప్రసాదాలు 29,505 ప్యాకెట్లు విక్రయం జరగడంతో ఈ సంఖ్య కూడా రికార్డుస్థాయికి దగ్గరగా నమోదైంది. కాగా, ఆదివారం ఒక్కరోజే వివిధ పూజలు, సేవలు టిక్కెట్ల ద్వారా ఆలయానికి రూ.1,95కోట్లు వచ్చిందని ఈవో చెప్పారు.



రూ.500 రాహు-కేతు పూజా మండపం వద్ద బారులు తీరిన భక్తులు

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేడు మదనపల్లెలో ఎస్సీ వర్గీకరణపై ధర్నా


విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు, ఆగస్టు4: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పుకు నిరసనగా సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణకు సహకరించడం సరికాదన్నారు. పార్లమెంటు, రాష్ట్రపతికి సంబంధం లేకుండా 341(1) సవరించకుండా మనువాద తీర్పు ఇస్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి మాలమహానాడు మేధావి వర్గాలు, విద్యార్థులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘనాయకులు శ్రీనివాసులు, నాగరాజ, రమేశ్, ఆనంద, రెడ్డెప్ప, ఈశ్వర్, శీన పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వి.కోట కార్యవర్గం ఏర్పాటు
అధ్యక్షులుగా పీఎంఆర్ ధీరజ్, కార్యదర్శిగా మురుగేష్ ఎన్నిక



వి.కోట, ఆగస్టు 4: లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వి.కోట నూతన కార్యవర్గాన్ని డిస్ట్రిక్ గవర్నర్ బాలకృష్ణ నేతృత్వంలో ఎన్నుకున్నా. అధ్యక్షులుగా పీఎంఆర్ ధీరజ్, రెండవ ధ్యక్షులుగా డా.ఏ.కే.తయిాంఖాన్, ప్రధాన కార్యదర్శిగా మురుగేష్, కోశాధికారిగా లక్ష్మణ్ చౌదరిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాలకు రూ. 45 వేలు విలువ చేసే వంట పాత్రలను బహూకరించారు ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ భక్తవత్సలం రెడ్డి, కో-ఆర్డినేటర్ అరుణ్‌కుమార్, రీజియన్ ఛైర్‌పర్సన్ గోపీకృష్ణా, జోన్ ఛైర్‌పర్సన్ లోకేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమం కోసం జనసేన సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో జనసేన నాయకులు

గుడుపల్లె, ఆగస్టు 4: కార్యకర్తల సంక్షేమం కోసమే జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ నరేష్, మండ లాధ్యక్షుడు అమీర్ తెలిపారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పార్టీ సభ్యత్వ నమోదులో కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. 20 రోజులు పాటు జరిగిన పార్టీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు ఎక్కువగా సభ్యత్వం చేసుకొన్నట్లు తెలిపారు. త్వరలో సభ్యత్వ నమోదు చేసుకొన్న వారందరికీ కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. పంచాయతీల్లోని నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హంసగిరి, మణికంఠ, రామచంద్ర, వామనమూర్తి, గణేష్, ఆనంద్, రాజేష్, హిమద్, మంజు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు అమావాస్య పూజలు



విశేషాలంకరణలో గంగమ్మ, పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకుప్పం, ఆగస్టు 4: రామకుప్పంలోని దిగువవీధి గంగమ్మ గుడిలో శనివారం రాత్రి అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారితో బాటూ ఆలయంలోని సత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వార్లకు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని, దేవతామూర్తులను దర్శించుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

మాతృభాషలో బోధనకు వినతి



పలమనేరు, ఆగస్టు4 : నూతన జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం పాఠ శాలల్లో విద్య మాతృభాషలో బోధన జరిగేలా కేంద్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు కోరారు. ఆదివారం పలమనేరుకు వచ్చిన కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

65 మందికి కంటి పరీక్షలు



పలమనేరు, ఆగస్టు4 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరంలో 65 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. చెన్నై శంకరనేత్రాలయ వైద్యులు మురళి పరీక్షలు నిర్వహించారు. 40 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. ఆపరేషన్లు చేసుకొనేవారిని చెన్నై శంకరనేత్రాలయకు తీసుకెళ్లి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామని, చెన్నైకి రాను, పోను వాహన సౌకర్యం కల్పిస్తామని డాక్టర్ మురళి తెలిపారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



వి.కోట, ఆగస్టు 4: వి.కోట తహసీల్దార్‌గా బి.పార్వతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. రెవిన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఆమె తెలిపారు.

డ్రిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

సోమల, ఆగస్టు 4: డ్రిప్ పరికరాల కోసం అర్హులైన ప్రతి రైతు దరఖాస్తు చేసుకోవాలని హార్టికల్చర్ ఆఫీసర్ సంతోషి కుమారి తెలిపారు. సోమల మండలంలో 9850 ఎకరాల్లో ఉద్యానపంటలు 7560 మంది రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో తమ ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన 1బీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 5ఎకరాలు లోపు భూమి ఉన్న రైతులు (చిన్న సన్నకారు రైతులు)కు 90 శాతం, పెద్దరైతులకు 70శాతం రాయితీ ఉంటుందని వివరించారు.

టమోటాకు మచ్చ


టమోటా కాయలపై ఏర్పడిన నల్ల మచ్చలు



సోమల, ఆగస్టు4: పదిరోజులుగా టమోటా తోటల్లో విచ్చల విడిగా చీడపీడలు వ్యాప్తి చెందుతున్నాయని రైతులు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. కాయలపై విచ్చల విడిగా మచ్చలు ఏర్పడుతున్నాయి. అలాగే పచ్చగా ఉన్న మొక్కలు వాడు ముఖం పడుతున్నాయి. ఈ క్రమంలో అధిక మోతాదుల్లో మందులు పిచికారీ చేస్తున్నా అదుపులోకి రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. 10 బాక్సులు కాయలు కోతలు చేస్తే 5 బాక్సుల మేరకు నల్ల మచ్చల కాయలే ఉంటున్నాయి. వీటిని మార్కెట్‌కు తరలిస్తే 15కిలోల బాక్సు రూ.40 ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో అధిక మొత్తంలో ఇలాంటి వైరస్ సోకి దిగుబడులు తగ్గి, తోటలే లేకుండా పోయాయని రైతులు ఆందోళచెందుతున్నారు. వేలకు వేలు మందుల పిచికారీ చేసినా ఫలితం లేకపోతోందని ఉద్యాన అధికారులు తోటలను సందర్శించి రైతులకు సూచనలు చేయాలని కోరుతున్నారు.

గ్రామస్థాయిలో టీడీపీ పటిష్టతకు కృషి


మోట్లచేనులో జరిగిన పంచాయతీ సమావేశం

కుప్పం రూరల్, ఆగస్టు 4: గ్రామస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని మోట్లచేను పంచాయతీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోట్లచేను పంచాయతీ పరిధిలో వరుసగా రెండు ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. ఆ కారణంతో పంచాయతీ పార్టీ కమిటీలను రద్దు చేసి, నూతనంగా 14 మందితో పంచాయతీ సమన్వయ కమిటీని నియమించినట్లు చెప్పారు. పార్టీకోసం చిత్తశుద్ధితో పనిచేసేవారికే పార్టీలో గౌరవంతోపాటు పదవులు, ఇతర అవకాశాలు దక్కుతాయని స్పష్టం చేశారు. అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఇతర పార్టీలనుంచి వచ్చే వారినికి స్థానిక నాయకులకు ఓసారి తెలియజేసి పార్టీలో చేర్చుకుంటామన్నారు. ఇందువల్ల పార్టీలో మొదటినుంచి పనిచేస్తున్న వారికి ఎటువంటి నష్టం జరగదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పార్థసారథి, మాజీ సర్పంచి రామచంద్ర, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



సదుం, ఆగస్టు 4: సదుం జడ్పీ ఉన్నత పాఠశాల 1974వ సంవత్సర పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తాము పదో తరగతి చదువుకుని 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం సిల్వర్ జూబ్లీ రీ-యూనియన్ వేడుక నిర్వహించారు. స్థానిక హసీనా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 50 మంది ఆనాటి విద్యార్థులు కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు నాగభూషణ్ రెడ్డి, రాఘవరెడ్డి, శివలక్ష్మి, జ్ఞానాంబ, నిర్వాహక పూర్వ విద్యార్థులు చంద్ర, ఇనాయతుల్లా, డా.నారాయణ, ప్రొ.శివప్రసాద్, జనార్దన్ రెడ్డి, కృష్ణారెడ్డి, నాగరత్న, మమత, లోక, రిటైర్డ్ డీఎస్పీ సోమశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

చౌడేపల్లె, ఆగస్టు4: రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మండల పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం శెట్టిపేట వద్ద వెలసిన మోక్ష గణపతి ఆలయం వద్ద నుంచి మంత్రికి ఘనస్వాగతం పలకాలన్నారు.

సోమల: మంత్రి రాంప్రసాద్ రెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సోమవారం చేపట్టే మండల పర్యటనను విజయ వంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, సీనియర్ నాయకుడు నగేశ్ కోరారు. సూరయ్యగారిపల్లెలో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు కార్యకర్తలు తరలిరావాలని తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు


అమ్మవారిని దర్శించుకొంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, సీఆర్.రాజన్

పలమనేరు, ఆగస్టు4 : పలమనేరు సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు సీఆర్ రాజన్ హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో అన్నిరంగాల్లో రాణించాలని కోరు కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.వి. బాలాజి, ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, లోకేష్, వెంకటరమణ, సుదర్శన్, విజయ్, మురళీమోహన్ పాల్గొన్నారు.

సోమల: చౌడేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా తొగటవీరక్షత్రియ సంఘం సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పోలూరు చలపతి, శ్రీనివాసులు, మునిరాజ, సుధాకర్, హరినాథ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు మలాథిన్ స్ప్రే

సోమల, ఆగస్టు 4: దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కందూరు, చిన్నఉప్పరపల్లె పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మలాథిన్‌ను స్ప్రే చేయించారు. కార్యదర్శి జయశంకర్ గ్రామాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, ఆగస్టు4: మండలంలోని పెద్ద మల్లెల నడింపల్లెలోని చౌడేశ్వరి అమ్మవారికి జయంతి సందర్భంగా ఆది వారం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. తొగట వీర క్షత్రియులు అమ్మవారి మేలు కొలుపు పద్యాలు పలువురిని అలరించాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అన్న ప్రసాదాలు చేశారు. అర్చకులు మహేష్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చల్లాబాబుకు సత్కారం



రొంపిచెర్ల, ఆగస్టు4: రొంపిచెర్లలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగల సంఘం పుంగనూరు తాలూకా నాయకులు పుంగ నూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డిని ఆది వారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఏపీజీఎఫ్ఏ అధ్యక్షుడు బాబు రాజేంద్ర ప్రసాద్, సెక్రటరీ మధుబాల, కోశాధికారి అమర్నాథ్, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పుంగనూరు పర్యటన

పుంగనూరు, ఆగస్టు4: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం పుంగనూరులో పర్యటించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివయ్య తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు స్థానిక జడ్పీ గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు



పుంగనూరు రూరల్, ఆగస్టు4: మండలంలోని చదళ్ల గ్రామ సమీపంలో వెలసిన చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను చౌడేశ్వరిదేవి ట్రస్ట్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అమావాస్య కావడంతో ఆదివారం ఉదయాన్నే వేద పండితులతో గణపతి పూజలు, హోమాలు, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, జయపాలరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● పట్టణంలోని మారెమ్మ, చాముండేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో ఆలయాలు కిక్కిశాయి.

పేదలకు మరిన్ని సేవలు


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 4: పేదల ప్రజలకు మరిన్ని సేవలు అందివ్వడానికి లయన్స్‌క్లబ్ ముందు ఉంటుందని లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణ సమీపంలోని డయాలసిస్ కేంద్రంలో బెంగళూరుకు చెందిన క్లబ్ మాజీ గవర్నర్ భక్తవత్సలరెడ్డి, జోన్ ఛైర్మన్ సుబ్బారెడ్డి, అరుణ్‌కుమార్, గోపాలకృష్ణలతో కలసి కుట్టుమిషన్లు, గొడుగులు, విద్యార్థులకు బెడ్‌షీట్లు, డయాలసిస్ కేంద్రానికి డయాలసిస్ మిషన్, ఆక్సిజన్ క్యాన్స్‌ట్రేటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ మాట్లాడుతూ క్లబ్ ద్వారా రూ.5 లక్షల విలువ చేసి వస్తువులు కొనుగోలు చేసి 125 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. ● అలాగే గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ఆరోగ్య శిబిరాలు, పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్లబ్ ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, సురేశ్, గోపాల్‌కృష్ణ, వరదా రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం.. ఎన్నటికి మోక్షం..!
కంకర తేలిన గ్రామీణ రోడ్లు ● వర్షాలకు గోతులమయం ● పట్టించుకోని అధికారులు


కరకర తేలి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన కృష్ణమ్మ కొండ వద్ద రహదారి

వి.కోట, ఆటస్టు 4: వి.కోట మండల పరిధిలోని గ్రామీణ రహదారులు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లను ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. 2002లో కుప్పం రోడ్డు నుంచి పేర్నాంబట్ రోడ్డు వరకు అంర్గతంగా వేసిన కార కుంట, గుమ్మిరెడ్డిపల్లె, కొత్తకోట, చింతమాకుల పల్లె మీదుగా నాయకనేరి రోడ్డుకు పదేళ్లగా నిర్వహణ చేపట్టక పోవడంతో రోడ్డు పూర్తిగా పాడైంది. కృష్ణమ్మ కొండ వద్ద రోడ్డు మొత్తం కంకరతేలి రాకపోకలకు అంతరాయం నెలకొంది. గుమ్మిరెడ్డిపల్లె వద్ద రోడ్డు పూర్తిగా గోతులు పడింది. కొత్తకోట నుంచి చింతమాకులపల్లెకు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలకు కారణమవు తున్నాయి. భైరుపల్లెక్రాస్ నుంచి అనంతపురం మీదుగా గెస్తింపల్లెకు వెళ్లే రోడ్డు నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో కల్వర్టు లేక వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. అలాగే తోటకనుమ పంచాయతీ కోటబండ, పోతనపల్లెకు వెళ్లే రహదారులకు కంకర పరచి వదిలేశారు. వర్షాలకు రోడ్డు గుంతల మయ మైంది. వి.కోటలో మార్కెట్ ఎదురుగా ప్రధాన రహదారి గుంతలు పడింది. వర్షం వస్తే ఈ రోడ్డు పూర్తిగా జలమయం అవుతుంది. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి ఛిద్రమైన రహదారులకు మోక్షం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీదేవి

పుంగనూరు రూరల్, ఆగస్టు4: పుంగనూరు- పలమనేరు మార్గంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ సంఘటన ఆదివారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ బాలాజీ కాలనీకి చెందిన శ్రీదేవి(30) రోడ్డుపై నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వీధుల్లో చెత్త వేస్తే రూ.500 జరిమానా



సిద్ధం చేసిన హెచ్చరిక బోర్డు

కుప్పం, ఆగస్టు 4: చెత్త రహిత మున్సిపాటీ దిశగా కుప్పం మున్సిపాలిటీ అడుగులు వేస్తోంది. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస రావు మున్సిపాలిటీని శుభ్రంగా ఉంచే లక్ష్యంలో భాగంగా ఇప్పటికే ఇంటింటినుంచి చెత్త సేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలోని 12 ట్రాక్టర్లు, 10 ఆటోల ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. ఇళ్ల వద్ద డస్ట్ బిన్స్ లోనే చెత్తను వేయాలని, తర్వాత మున్సిపల్ చెత్త వాహనాల వెంట వచ్చే పారిశుద్య సిబ్బందికి అందించాలని ఆయన ప్రజలకు చెబుతున్నారు. వార్డుల వారీగా మెప్మా సిబ్బంది, ఆశా వర్కర్లతో మహిళలకు అవగాహనా సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు 'ఇక్కడ చెత్త వేయరాదు. వేసినచో రూ.500 జరిమాన విధించబడును' అని రాసిన హెచ్చరిక బోర్డులు ఇప్పటికే మున్సిపాలిటీ తరపున తయారు చేయించారు. ఈ బోర్డులను సాధారణంగా ప్రజలు చెత్తవేసే ప్రదేశాలలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అలాగే ఇంటినుంచి చెత్తను సేకరించడానికి ఎవరిని సంప్రదించాలో వారి ఫోన్ నెంబర్ కూడా ఈ బోర్డుల్లో రాస్తున్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పోరాటాలతోనే జిల్లా సమగ్రాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

చిత్తూరు రూరల్, ఆగస్టు 4: పోరాటాలతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా సిద్ధం కావాలని సీపీఐ కార్యకర్తలకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు దిశానిర్దేశం చేశారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విభజన తర్వాత చిత్తూరు జిల్లా పూర్తిగా వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పార్టీని, ప్రజా సంఘాలను బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్తా సిద్ధపడాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు చిత్తూరు అభివృద్ధికి సహకరించాలన్నారు. సీపీఐ నాయకులు శ్రీరాములు, మణి, సుబ్రమణ్యం, చంద్ర, విజయకుమార్, రమాదేవి, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం, ఆగస్టు 4: మండలంలోని మాధవరం ఐటీఐలో ప్రవేశానికి మూడవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లలిత తెలిపారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి, సంబంధిత ధ్రువపత్రాలను ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కళాశాలలో సమర్పించి, వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8639790174, 6303156450, 9494434236, 9177035120, 9885320544లను సంప్రదించాలని తెలిపారు.

సీఎంను కలిసిన కోదండ యాదవ్



చిత్తూరు రూరల్, ఆగస్టు 4: మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును ఆదివారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి సీఎంకు వివరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ను కలిసి సన్మానించారు.

ఐఈఆర్టీలను రెగ్యులర్ చేయాలి


ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నేతలు

నిండ్ర, ఆగస్టు 4: సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగంలో పనిచేస్తున్న 1,350 మంది ఐఈఆర్టీలను రెగ్యులర్ చేయాలని ఏపీ భవిత స్పెషల్ ఎడిటర్ ఫెడరేషన్ సభ్యులు ఆదివారం నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీబీఎస్ ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొమ్మి నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న ఐఈఆర్టీలను రెగ్యులర్ చేసి, ఏటా రెన్యూవల్ విధానంలో తీసుకువచ్చిన నిబంధనలను తొలగించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పెనుమూరు, ఆగస్టు 4: స్థానిక ఎమ్మార్సీలో తిరుపతి మాధురి ఆస్పత్రి వారు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 275 మందికి షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు ఆస్పత్రి చైర్మన్ మాధురి గాంధీ తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, నేతలు తలారి రెడ్డెప్ప, భాస్కర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుంతల రోడ్డుతో అవస్థలు


ఉగ్రాణంపల్లిలో రోడ్డుపై నిలిచిన నీరు

పెనుమూరు, ఆగస్టు 4: పెనుమూరు నుంచి చిత్తూరు మార్గంలో ఉగ్రాణంపల్లి సప్తగిరి బ్యాంకు ముందు రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం కురిసినా అందులో నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. ఇదే మార్గంలో పెద్దరాజుపల్లి వద్ద ఇదే పరిస్థితి ఉంది. గంగుపల్లి చెరువు వద్ద రోడ్డు తవ్వేసి మూడు నెలలవుతున్నా పట్టించుకునేవారు లేరు.

ఉపాధ్యాయుడికి సన్మానం



బంగారుపాళ్యం, ఆగస్టు 4: మండలంలోని కొదలమడుగు పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు సంజీవయ్యను టేకుమందకు చెందిన పూర్వ విద్యార్థులు, ఎంఈవో నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ముగిసిన మారియమ్మ తిరునాళ్ల


అమ్మవారి ఊరేగింపు

గుడిపాల, ఆగస్టు 4: మండలంలోని కుప్పిగానిపల్లి పంచాయతీ కండిగ గ్రామంలో ఆదివారం వసంతాలతో మారియమ్మ తిరునాళ్ల ముగిసింది. ఆలయ ధర్మకర్త ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అంబళ్లు పోసి పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పుష్పపల్లకిలో ఊరేగించారు.

అగ్నిహోత్రిగా ద్రౌపదీదేవి



నగరి, ఆగస్టు 4: చింతలపట్టెడ ద్రౌపది తిరునాళ్లలో భాగంగా ఆదివారం అమ్మవారు అగ్నిహోత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అఖిలోభుడనే రాక్షసుడిని సంహరించడానికి ద్రౌపదీదేవి అగ్ని నుంచి అవతరించిందని ప్రతీతి. ఇందుకు ప్రతీకగా అగ్నిహోత్రి అలంకారం చేశారు. అమ్మవారి విగ్రహం చుట్టూ పెద్దయెత్తున దీపాలు పెట్టారు. మహాభారత పారాయణంలోనూ భాగవతారిణి అగ్నికుండలను పట్టుకుని పారాయణం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఏర్పాట్లను ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ పర్యవేక్షించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

చిత్తూరు, ఆగస్టు 4: జూదమాడుతున్న ముగ్గురిని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నగరంలోని టాప్‌లైన్ క్వార్టర్స్‌లో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేసి, రూ.13,180 నగదు సీజ్ చేశారు.

తహసీల్దార్‌కు సన్మానం


సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నగరి, ఆగస్టు 4: నగరి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను టీడీపీ నాయకులు ఆదివారం సన్మానించారు. నగరిలో పలు రెవెన్యూ సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించి అందరికీ న్యాయం చేయాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలసిన బీజేపీ నేత



వెదురుకుప్పం, ఆగస్టు 4: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మను ఆదివారం వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లెకు చెందిన ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ కలిశారు. మంత్రిని సన్మానించి, నియోజకవర్గంలో పార్టీ స్థితిగతుల గురించి వివరించామన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ వితరణ



వెదురుకుప్పం, ఆగస్టు 4: మాంబేడు గ్రామ పంచాయతీ గెరిగిదొనకు చెందిన దివ్యాంగురాలు హేమలతకు జనసేన పార్టీ వీల్‌చైర్ అందించింది. శనివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ అందజేశారు. నేతలు యతీశ్వర్‌రెడ్డి, సతీష్, భానుచంద్రారెడ్డి హాజరయ్యారు.

జనసేన సభ్యత్వ నమోదు

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదును మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మనదొడ్డలో ఆదివారం చేపట్టారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ సభ్యత్వ నమోదు చేయించారు. సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

లగేజీ ఆటో బోల్తా : ఒకరికి గాయాలు



వెదురుకుప్పం, ఆగస్టు 4: వెదురుకుప్పం నుంచి దేవళంపేట వైపు వెళ్తున్న ఓ లగేజీ ఆటో ఆదివారం మధ్యవంక సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఒకరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తి వివరాలు తెలియరాలేదు.

సెక్యూరిటీ లేని ఏటీఎంను మూసివేయండి


ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్ఐ నరేంద్ర కుమార్

గుడిపాల, ఆగస్టు 4: సెక్యూరిటీ లేని ప్రైవేటు ఏటీఎంలను మూసేయాలని గుడిపాల ఇన్‌చార్జి ఎస్ఐ నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఉన్న ఒక ఏటీఎంను ఆయన పరిశీలించారు. సెక్యూరిటీ గార్డు, సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆ ఏటీఎంను మూసివేయాలని, లేనిపక్షంలో అనుమతి పొందాలని ఆదేశించారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జయంతి


విశేష అలంకారంలో చౌడేశ్వరిదేవి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 4: గిరింపేట చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా చండీహోమం నిర్వహించారు. సుబ్రమణ్యం స్వామి కొండ కింద ఉన్న వినాయక ఆలయం నుంచి భక్తులు బిందెలతో పాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సంతాన వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకం



గంగాధరనెల్లూరు, ఆగస్టు 4: మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయ కోనేటి వద్ద గల సంతాన వెంకటేశ్వర స్వామి, ధన్వంతర స్వామిలకు ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఉదయం ముందుగా స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు చేశారు. హరికథా కాలక్షేపం ఏర్పాటు చేశారు. అన్నమయ్య కీర్తనలు, వెంకటేశ్వరస్వామి భక్తిగీతాలను ఆలపించారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్ పాల్గొన్నారు.


జీడీ నెల్లూరు మండలం మహదేవమంగళం చెరువుకట్టపై కంకరతేలిన రోడ్డు - తిరువీధికుప్పం - జూపల్లె మధ్యలో ధ్వంసమైన రోడ్డు
గుడిపాల మండలంలో గతుకులమయంగా ఉన్న ఎంసీఆర్ క్రాస్, పానాటూరు రోడ్లు

గతుకుల రోడ్లే గతి

- గడచిన ఐదేళ్లలో ప్యాచ్‌లు కూడా వేయని వైనం
- పంక్చర్ అవుతున్న టైర్లు.. విరుగుతున్న స్ప్రింగ్ ప్లేట్లు

గంగాధరనెల్లూరు/గుడిపాల, ఆగస్టు 4: జీడీ నెల్లూరు, గుడిపాల మండలాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పూర్తిగా ధ్వంసమై కంకరతేలి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. గడచిన ఐదేళ్లలో కనీసం ప్యాచ్‌లు వేయకపోవడంతో మార్గంమధ్యలో టైర్లు పంక్చర్ అవుతున్నాయి. గుంతల్లో దిగి ఎక్కుతుండడంతో స్ప్రింగ్ ప్లేట్‌లు విరిగిపోతున్నాయి. జీడీ నెల్లూరు మండలం మహదేవమంగళం చెరువు కట్ట తారు రోడ్డు పూర్తిగా కంకర తేలింది. దీంతో చిన్నవేపంజేరి, మహదేవమంగళం, తిరువీధికుప్పం, కడపగుంట పంచాయతీల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మంగినాయనికుప్పం బస్టాప్ నుంచి కడపగుంట పంచాయతీ సరిహద్దు వరకు నాలుగు కిలోమీటర్ల దూరం రోడ్డు ధ్వంసమై, గుంతలు ఏర్పడి, కంకర తేలిపోయింది. మహదేవమంగళం చెరువుకట్ట రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. రోడ్డు వెడల్పు చేయాలని పలుమార్లు అర్జీలు సమర్పించినా లాభం లేకపోయింది. అలాగే గుడిపాల మండలంలోనూ పలురోడ్లు కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. వేలూరు రహదారిలోని ఎంసీఆర్ క్రాస్, పానాటూరు రోడ్లు గుంతలుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే పలువురు గాయపడ్డారని, ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా రోడ్ల దుస్థితిపై దృష్టి సారించి, బాగు చేయాలని కోరుతున్నారు.

సమష్టిగా మండలాన్ని అభివృద్ధి చేద్దాం
- పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, ఆగస్టు 4: అందరం కలసికట్టుగా పనిచేసి, ఐరాల మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మండలానికి 109 పనులు మంజూరు కాగా కేవలం 49మాత్రమే పూర్తి చేశారన్నారు. మండలంలో ఈ ఏడాది చేపట్టాల్సిన పనులను ఒకొక్కటిగా చేస్తామన్నారు. ముందుగా శ్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి, ఆ సమస్య పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. గోవిందరెడ్డిపల్లె ఎస్టీ కాలనీలో తాగునీటి సరఫరా పెంచేందుకు అవసరమైన పనులు వెంటనే చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు గత ప్రభుత్వంలో అందిస్తున్న జీతం చాలడం లేదని తాను గుర్తించానని, వారికి జీతం పెంచేలా కృషి చేస్తానని అన్నారు. పెండింగ్ జీతాలు అందించేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సుచిత్ర, తహసీల్దార్ మహేష్‌కుమార్, ఈవోపీఆర్డీ కుసుమ, టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధరబాబు, మాజీ జడ్పీటీసీ లత, నాయకులు హరిబాబునాయుడు, ఎంఎన్‌చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ ధనంజయనాయుడు, బీజేపీ నాయకుడు రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనులను త్వరగా పూర్తి చేయాలి


క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 4: నగరి మున్సిపాలిటీ పరిధిలోని సంత మైదానంలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం క్యాంటీన్ పనులను పరిశీలించిన ఆయన పలు సూచనలిచ్చారు. 15వ తేదీన క్యాంటీన్‌ను ప్రారంభించాల్సి ఉందని, 14 నాటికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు గుణశేఖర్, సురేష్‌నాయుడు, టీఎన్‌టీయూసీ బాలాజీ, జ్యోతినాయుడు, మున్సిపల్ డీఈ నరేష్ పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలతో సమస్యల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న వాసు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 4: సమష్టి పోరాటలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం (బీసీటీఏ) జిల్లా అధ్యక్షుడు వాసు అన్నారు. ఆదివారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా సమస్యగా మారిన సీనియారిటీ జాబితా క్రమబద్ధీకరణ పూర్తయిందన్నారు. జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణయ్య, యూనివర్సిటీ కార్యదర్శి శంకర్‌రెడ్డి, కోశాధికారి గురుమూర్తి పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కేంద్ర మంత్రి


భూపతిరాజు శ్రీనివాసవర్మ, టీజీ.వెంకటేష్ జ్ఞాపికలు అందిస్తున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 4: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయనకు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు. ఈవో వెంకటేశు ఆలయ రాజగోపురం వద్ద స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌కుమార్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, వరసిద్ధుడిని మాజీ మంత్రి టీజీ.వెంకటేష్ కూడా దర్శించుకున్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు


దుర్యోధన, భీముడి పాత్రధారుల యుద్ధ సన్నివేశం

చిత్తూరు రూరల్, ఆగస్టు 4: చిత్తూరు రూరల్ మండలం కుర్చివేడు శ్రీకృష్ణ ద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద 17 రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞ మహోత్సవం ఆదివారం దుర్యోధన వధతో ముగిసింది. చివరి ఘట్టమైన దుర్యోధన వధ భక్తులను ఆకట్టుకుంది. దుర్యోధన, భీముడి పాత్రధారుల మధ్య యుద్ధ సన్నివేశాలు రక్తి కట్టించాయి. చుట్టుపక్కల 11 గ్రామాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. దుర్యోధన, భీముడి వేషధారులను ఘనంగా సన్మానించారు. ఉభయదారులు వీకే జయరామ్, నీలకంఠంనాయుడు, మునస్వామి నాయుడు, యోగమూర్తి నాయుడు, దిలీప్, దేవరాజులు నాయుడు, ఓంకారనాయుడు, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర పాల్గొన్నారు.

యాదవ ఎంప్లాయిస్ సొసైటీ నూతన కార్యవర్గం



పాలసముద్రం, ఆగస్టు 4: పాలసముద్రంలో ఆదివారం యాదవ ఎంప్లాయిస్ సొసైటీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేంద్ర యాదవ్, గంగాధరనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుమూర్తి యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో మండల గౌరవాధ్యక్షుడిగా రఘు యాదవ్, అధ్యక్షుడిగా ఎన్. ఉమాపతి, ప్రధాన కార్యదర్శిగా పి.చంద్రశేఖర్ యాదవ్, కోశాధికారిగా జె.మోహన్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కే.కేశవులు యాదవ్, ఇ.కోదండయ్య, కార్యదర్శులుగా అమరనాథ్ యాదవ్, రాఘవేంద్ర యాదవ్, శ్యామలమ్మ, సాఫ్ట్‌వేర్ విభాగం కన్వీనర్‌గా ఎస్.చిరంజీవి యాదవ్‌లు ఎన్నికయ్యారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజపురం, ఆగస్టు 4: గ్రామాల్లో అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీపీ సరిత పేర్కొన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు వారికి సంబంధించిన శాఖల గురించి వివరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో మోహన్ మురళి తెలిపారు. జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ హరిత, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దుస్థితిలో ఇరిగేషన్ కార్యాలయం


పిచ్చి మొక్కలతో నిండిపోయిన ఆవరణ

కార్వేటినగరం, ఆగస్టు4: స్థానిక కృష్ణాపురం ప్రాజెక్టు అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయ ప్రాంగణం దుస్థితిలో ఉంది. పిచ్చి మొక్కలతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ఈ పరిస్థితి చూసి అసహనానికి గురవుతున్నారు. విష పురుగుల బెడదతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

కమ్మతిమ్మాపల్లి క్రాస్‌లో మత్తు పదార్థాల జోరు

గుడిపాల, ఆగస్టు 4: మండలంలోని కమ్మతిమ్మాపల్లి క్రాస్ సమీపంలో మత్తు పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్ర సరిహద్దు కావడంతో ఈ గ్రామం వద్ద అటు తమిళనాడు, ఇటు ఆంధ్రకు చెందిన యువత సారా, మద్యం, గంజాయి తాగుతూ వాటికి బానిసలవుతున్నారు. పైగా అటువైపు వెళ్లే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు ఈ విషయం తెలిసినా మామూళ్లకు అలవాటుపడి చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వ్యాధులకు నిలయంగా దుర్గానగర్ కాలనీ


చెరువులో విస్తరించిన గుర్రపు డెక్క

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 4: నగరంలోని దుర్గానగర్ కాలనీ వ్యాధులకు నిలయంగా మారింది. ప్రతి ఇంట్లోనూ ఒకరు లేదా ఇద్దరు జ్వరాలతో బాధపడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే చాలామంది ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కాలనీలో డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దోమలు వ్యాప్తి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాలనీ మధ్యలో ఉన్న చెరువులో గుర్రపు డెక్క విస్తరించి, దోమలకు ఆవాసంగా మారింది. పారిశుధ్యాన్ని కాపాడాల్సిన నగరపాలక సంస్థ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

చౌడేపల్లె, ఆగస్టు4: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మండల పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం శెట్టిపేట వద్ద వెలసిన మోక్ష గణపతి ఆలయం వద్ద నుంచి మంత్రికి ఘనస్వాగతం పలకాలన్నారు.

సోమల: మంత్రి రాంప్రసాద్ రెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సోమవారం చేపట్టే మండల పర్యటనను విజయ వంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, సీనియర్ నాయకుడు నగేశ్ కోరారు. సూరయ్యగారిపల్లెలో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు కార్యకర్తలు పెద్దయెత్తున తరలిరావాలని తెలిపారు.